ప్రపంచ గణిత పండితుడు

లక్కోజు



సంజీవ రాయ శర్మ (ఫైల్)

- దేశవ్యాప్తంగా 6 వేలకు పైగా గణితావధాన ప్రదర్శనలు
- అంకవిద్యాసాగర, విశ్వసాంఖ్యాచారులుగా బిరుదులు ప్రదానం
- నేడు గణితబ్రహ్మ డాక్టర్ లక్కోజు సంజీవరాయ శర్మ వర్ధంతి

వయోలిన్ వాయిస్తూ అవధానం చేస్తున్న లక్కోజు సంజీవరాయ శర్మ (ఫైల్)



ఆయన ఒక మారుమూల గ్రామంలోని సాధారణ కుటుంబంలో జన్మించారు. ఎలాంటి విద్యాభ్యాసం లేదు. పుట్టుకతోనే అంధుడు. అయినా అందరికీ కష్టతరమైన లెక్కల గణనలో ఆయనకు మరొకరు సాటిలేరు. గణితంలో ఎంత పెద్ద లెక్కనైనా ఇట్టే పరిష్కరించి చెప్పగలరు. ఎంతో భాషా సాహిత్య పాండిత్యముంటే గానీ అవధానాలు చేయలేరు. అందులో గణితంలో అవధానం చేయడం చాలా కష్టతరం. అలాంటిది గణితంలో దేశవ్యాప్తంగా 6 వేలకు పైగా గణితావధానాలు చేసి పండితులను సైతం ఆశ్చర్య చకితులను చేసిన అనితరసాధ్యుడు, అపార జ్ఞానవంతుడు గణిత బ్రహ్మ డాక్టర్ లక్కోజు సంజీవరాయశర్మ. కష్టతరమైన లెక్కలకు వయోలిన్ పలికించి వెంటనే సమాధానం చెప్పే అసామాన్య ప్రతిభ ఆయన సొంతం. గణిత విద్యా ప్రావీణ్యంతో అందరినీ ఆకట్టుకున్న ప్రతిభావంతుడు సంజీవ రాయ శర్మ తప్ప మరెవరూ లేరని ఎందరో మేధావులు కొనియాడారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రొద్దుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామంలో 1907 సంవత్సరం నవంబరు 22న పెద్ద పుల్లయ్య, నాగమాంబ దంపతులకు లక్కోజు సంజీవరాయ శర్మ జన్మించారు. ఆయన పుట్టుకతోనే అంధుడు. ఆయనను పెంచడం చాలా కష్టతరమని.. గొంతు పిసికి దిబ్బలో పూడ్చివేయాలని మంత్రసాని సలహా ఇచ్చింది. మరికొందరు మహిళలు పురిటి బిడ్డ నోట్లో వడ్లగింజలు వేశారు. అయినా ఆ పసివాడు చావ లేదు. ఆ చిన్నారి హస్తరేఖలు చూసిన తాతా సంజీవరాయశర్మ గొప్ప ప్రతిభావంతుడు అవుతాడని చెప్పడంతో అంధుడైనా ఎంతో ప్రేమతో తల్లిదండ్రులు పెంచుకున్నారు. బాల్యదశలోనే తండ్రి మరణించారు. తల్లి పెంచి పెద్ద చేసింది. ఆ రోజుల్లో బ్రెయిలీ లిపి లేకపోవడంతో సంజీవరాయశర్మ చదువుకునేందుకు వీలు కాలేదు. అతడి అక్క అక్కమ్మ కల్లూరు ప్రాథమిక పాఠశాలలో చదివేది. ఆమె బడికి వెళ్లి వచ్చాక ఇంటి వద్ద పాఠాలు గట్టిగా చదువుతుంటే విని గుర్తు పెట్టుకునేవారు. అలా ఆయన మామూలు పాఠాలతో పాటు అంకెలు, గణిత సూత్రాలు గుర్తు పెట్టుకుని పునశ్చరణ చేసేవారు. ఎవరి వద్ద చదువుకోకుండానే గణితంలో తనకంటూ తెలియని విషయాలు ఏవీ లేవంటూ విమర్శకులను మెప్పించారు. గ్రామంలో రైతులకు ధాన్యం ధర, భూమి కొలతలు చెప్పేవారు. దీనికి వారు ఆయనకు కొంత సొమ్ము చెల్లించేవారు. గణితంలో ప్రావీణ్యం సాధిస్తున్న సమయంలోనే కల్లూరులోని లక్ష్మీనరసయ్య అనే విద్వాంసుని దగ్గర వయోలిన్ నేర్చుకున్నారు. ఆ తరువాత వయోలిన్ వాయించడం ఆయన జీవితంలో భాగమైంది.

రాష్ట్రపతి, ప్రధాని ఎదుట గణితావధానం

1959లో నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ఢిల్లీలో లక్కోజితో గణితావధానాన్ని ఏర్పాటు చేయించి తిలకించారు. ఆ కార్యక్రమానికి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కూడా హాజరయ్యారు. 1961 జనవరి 16న ముద్దనూరులోని యామవరం రోశిరెడ్డి నాయకత్వంలో గణితావధానం చేశారు. ఈ ప్రదర్శన తిలకించిన పండితులు, శాస్త్రవేత్తలు, ప్రజలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఇది ఆయనకు లభించిన మొదటి బంగారు పతకం. అప్పటి నుంచి ఆయన దేశవ్యాప్తంగా ఢిల్లీ, ముంబాయి, బిహార్, కర్ణాటక రాష్ట్రాలలో 6 వేలకు పైగా గణితావధాన ప్రదర్శనలు ఇచ్చారు.

గణితంలో ప్రజ్ఞ

సాహిత్యంలో కవులు అవధానాలు చేయడం పరిపాటి. అంటే 8 మంది వరుసగా ప్రశ్నలు వేస్తుంటే ఆయా అంశాలకు వెంట వెంటనే పద్యాల రూపంలో జవాబు చెప్పాలి. అలాగే గణితంలో కూడా అవధానం ఉంది. లక్కోజు సంజీవరాయ శర్మ గణితంలో అవధానాలు చేయడంలో దిట్టగా మారారు. పుట్టినతేదీ, సంవత్సరం, ప్రదేశం, సమయం చెప్పగానే ఆయన దానికి సంబంధించిన తిథి, వారం, నక్షత్రం, యోగ కరణాలు చెప్పేసేవారు. అలాగే జాతకాన్ని సైతం తెలియజేసేవారు. కలం, కాగితం రెండూ ఉన్నా గంటల కొద్దీ సమయంలో కూడా చెప్పలేని సమాధానాలను ఆయన ప్రశ్న అడిగినంత సులభంగా ఏమాత్రం తడుముకోకుండా చెప్పేవారు. ఆయనేమన్నా విద్యావంతుడా పోనీ రెండు కళ్లు ఉండి అంకెలిలా ఉంటాయి, సంఖ్యలిలా ఏర్పడుతాయని చూడగలిగిన వారా! కాదు పుట్టుకతోనే అంధుడు. వేల ప్రశ్నలు అడిగినా ఆయన చెప్పిన సమాధానాలు సరిచూసుకోవడానికి గణిత మేధావులకు గంటల తరబడి సమయం కావలసి వచ్చిందని చెబుతారు.

ఆయన మొట్ట మొదట 1928 నవంబరు 15న నంద్యాలలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో గణిత అవధానం చేసి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. 1931 జూలై 21న ఆంధ్ర మహాసభ భవనంలో స్వాతంత్ర్య సమర యోధుడు నాగేశ్వరరావు అధ్యక్షతన సంజీవరాయ శర్మ గణితావధానం చేశారు. ఆ కార్యక్రమంలో నాటి మద్రాసు గవర్నర్ సర్ జార్జి స్టాన్లే అవధానం తిలకించి ఆశ్చర్య చకితులై శర్మతో కరచాలనం చేశారు. శర్మ ఇంగ్లాండులో పుట్టి ఉంటే ఆయన విగ్రహాన్ని లండన్ నడిబొడ్డున ఏర్పాటు చేసి దేశాధ్యక్షుడి చేత ఆవిష్కరించి గౌరవించి ఉండేవాళ్లమని కొనియాడారు.

4 వేల ఏళ్ల క్యాలెండర్

4 వేల సంవత్సరాలకు సరిపడే క్యాలెండర్‌ను తయారు చేసి ఆనాటి భారత రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ కు పంపారు. రాష్ట్రపతి ప్రశంసిస్తూ నెల చివరి రోజులు కనుక నా జీతంలో మిగిలిన మొత్తం రూ.875 పంపిస్తున్నానని ఎక్కువ సొమ్ము పంపలేకపోయానని సందేశం రాష్ట్రపతి శర్మకు సందేశం పంపారు.

హ్యూమన్ కంప్యూటర్ శకుంతలాదేవితో ప్రశంసలు

1958 జనవరి 21న బెంగళూరు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో శర్మ గణిత అవధాన ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనలో హ్యూమన్ కంప్యూటర్‌గా పేరుగాంచిన శకుంతలాదేవితో శర్మకు పరిచయం ఏర్పడింది. ఆయన మేధాసంపత్తిని గణిత శాస్త్ర ప్రావీణ్యాన్ని, ప్రతిభను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. శర్మ నా కంటే గొప్పవారని ఆమె కీర్తించారు. తేదీ ఇస్తే దానికి నేను వారం మాత్రమే చెప్పగలను శర్మ మాత్రం తెలుగు సంవత్సరం, నెల, నక్షత్రం, తిథి, రాశి తదితర వివరాలన్నీ చెబుతారు. ఇది సామాన్యమైన విషయం కాదు అని శకుంతల ఆయన గొప్పతనాన్ని కొనియాడటం విశేషం.

ప్రపంచ గణిత శాస్త్రజ్ఞుల్లో ఒకరు

ప్రపంచంలో అంధులైన జాన్‌మిల్టన్, బ్రెయిలీ లిపి కనుగొన్న లూయిస్ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్, ద్వారం వెంకటస్వామినాయుడు వంటి వారు పుట్టుకతో అంధులు కారు. తదనంతరకాలంలో వారు అంధులయ్యారు. మన దేశంలో గణిత శాస్త్రజ్ఞుల్లో భాస్కరాచార్యులు, రామానుజన్, శకుంతలాదేవి వంటి వారు మంచి శిక్షణ పొందారు. కానీ సంజీవరాయ శర్మ ఎలాంటి చదువు సంధ్యలేని వ్యక్తి. పైగా అంధుడు అంతా వినికిడి జ్ఞానంతోనే గణిత అవధానిగా పేరొందారు. ప్రపంచంలోని ఆరుగురు గణిత మేధావుల్లో ఒకరిగా ఖ్యాతి పొందారు.

బంగారు పతకాలతో సత్కారం

దేశవ్యాప్తంగా ఆయన చేసిన 6 వేలకు పైగా గణిత అవధానాలకు పలు విశ్వవిద్యాలయాలు ఆయనను సత్కరించి 14 బంగారు పతకాలు ఆయనకు అందజేశాయి. సంజీవరాయ శర్మ గణిత అవధాన ప్రతిభను గుర్తించిన వెంకటేశ్వర విశ్వవిద్యాలయం 1993లో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి గౌరవించింది. అలాగే గణిత బ్రహ్మ అంకవిద్యా సాగర విశ్వసాంఖ్యాచార్య బిరుదులు ప్రదానం చేశారు.

విజ్ఞానాన్ని దొంగిలించలేరు

1964లో రేణిగుంట నుంచి తిరుపతికి రైలులో ప్రయాణం చేస్తుండగా శర్మ కోటుకు ఉన్న 14 బంగారు పతకాలను దొంగ దొంగిలించాడు. నా పతకాలు దొంగిలిస్తే దొంగిలించారు కానీ నా విజ్ఞానాన్ని ఎవరూ దొంగిలించలేరని ఆయన ఏమాత్రం బాధపడకుండా చెప్పారు.

కాళహస్తీశ్వరుని సన్నిధిలో...

1968 నుంచి 1993 వరకు ఆయన కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో వయోలిన్ వాయిస్తూ జీవనం సాగించేవారు. 1994 జనవరి 4న భార్య ఆదిలక్షుమ్మ చనిపోవడంతో కుమారుడు సుబ్బరాయుడు వద్దకు చేరారు. 1997 డిసెంబరు 2న హైదరాబాదులో ఆయన పరమపదించారు. ఈయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కల్లూరులో సంజీవరాయ శర్మ విగ్రహం

కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూలులో గణితబ్రహ్మ సంజీవరాయ శర్మను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని గణిత మేధావి కావాలనే ఉద్దేశ్యంతో 2018 డిసెంబరు 2న ఆయన వర్ధంతి సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. లక్కోజు సంజీవరాయ శర్మ జయంతి నవంబరు 22న ప్రతి ఏడాది గణిత ప్రతిభా పరీక్షలు పెట్టి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. 1989-90లో పదో తరగతి



చదివిన పూర్వ విద్యార్థులు శర్మ విగ్రహాన్ని తయారు చేయించారు. ఇంతటి ఖ్యాతి, కీర్తి కలిగిన సంజీవరాయ శర్మ విగ్రహం సాహిత్య ఉద్దండులకు నిలయమైన ప్రొద్దుటూరులో ఏర్పాటు చేయాలని పలువురు సాహిత్య ప్రముఖులతో పాటు ఉపాధ్యాయులు, మేధావులు కోరుతున్నారు.

హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపొద్దు

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

కడప కలెక్టరేట్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుని జీవన ప్రమాణం పెంచేందుకు చికిత్స ఉందని, సమాజంలో వారి పట్ల వివక్ష చూపడం తగదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని హెల్త్ అధికారులు, సిబ్బంది, అనధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. కార్పొరేషన్ కార్యాలయం నుంచి డీఎంఅండ్‌హెచ్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన నినాదం 'మీ ఆరోగ్యం- మీహక్కు'తో సాగింది. అనంతరం సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ హెచ్‌ఐవీ మహమ్మారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి గ్రస్తుని జీవన ప్రమాణం పెంచేందుకు ఎల్లవేళలా హెచ్‌ఐవీ 2017 యాక్ట్ అండగా ఉంటుందన్నారు. డీఎల్‌టీఓ డాక్టర్ సగిలి రవిబాబు మాట్లాడుతూ నేటితరం యువత సెల్ ఫోన్లు, మత్తు పదార్థాల వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్లు ఉమా మహేశ్వరకుమార్, రాజేంద్ర తదితరులు ప్రసంగించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలందించిన వారందరికి మెమెంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిమో భారతి, కుమారీ, దిశా సూపర్ వైజరు పీవీ ప్రసాద్, దిశ టీం సిలార్, సాధిక్ అఫ్రోజ్ సభ్యులు, హెల్త్ ఎడ్యుకేటర్స్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఏఎన్ఎం, డీఎల్ఎస్ఏలు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్



విజేతలకు బహుమతులు అందిస్తున్న అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు

కడప క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న పోలీసు వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. ఈ క్రీడాపోటీల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు వేడుకల కార్యక్రమానికి అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. అనంతరం పోలీసుసబ్ డివిజన్లు, కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల మరియు ఆర్మ్‌రిజర్వు నుంచి పాల్గొన్న పోలీసు క్రీడాకారులు ముగింపు మార్చ్‌ఫాస్ట్ చేసి అదనపు ఎస్పీకి గౌరవ వందనం చేశారు. పోలీసు స్పోర్ట్స్ మీట్ లో వ్యక్తిగత చాంపియన్‌గా ట్రాఫిక్ పీఎస్ కానిస్టేబుల్ ఎల్.సతీష్ బాబు నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌గా కడప సబ్‌డివిజను జట్టు నిలిచింది. స్పోర్ట్స్‌మీట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు మరియు డీపీవో సిబ్బంది, అవుట్ సోర్సింగ్, క్లాస్ ఫోర్ ఉద్యోగుల విభాగాల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి అదనపు ఎస్పీ ట్రోఫీలు, మెడల్స్, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం స్పోర్ట్స్‌మీట్‌కు ప్రతీకగా సూచించే పోలీసు పతాకాన్ని అదనపు ఎస్పీకి క్రీడాకారులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్ 2024 పండుగ వాతావరణంలో ఉత్సాహంగా కొనసాగాయని సంతోషం వ్యక్తం చేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటేశ్వర్లు, మురళీనాయక్, భక్తవత్సలం, వెంకటేశ్వర్ రావు, రాజేంద్రప్రసాద్, రమాకాంత్, మురళీధర్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 2న సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని (గ్రీవెన్స్) తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టరు డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ కారణంగా సోమవారం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల నుంచి వినతులు స్వీకరించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలిక రద్దు చేశామన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టరు తెలిపారు.

ప్రొద్దుటూరు టౌన్‌ప్లానింగ్‌లో

కీలక ఫైళ్లు మాయం

- చార్జ్‌లిస్టు అప్పగించకనే బదిలీపై వెళ్లిన ఏసీపీ మునిరత్నం
- సమాధానం ఇవ్వాలని నోటీసులు జారీ చేసిన కమిషనర్



ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం

ప్రొద్దుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో పలు కీలక ఫైళ్లు మాయమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఫైళ్ల అదృశ్యం వెనుక ప్రధానంగా ఇక్కడ పనిచేసి కడప కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లిన ఏసీపీ మునిరత్నం హస్తం వున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మునిరత్నం ప్రొద్దుటూరులో పని చేసే టప్పుడు అనేక అవినీతి ఆరోపణలున్నాయి. కౌన్సిల్లోనే అతని అవినీతిపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. ప్రొద్దుటూరులో అతని హయాంలో వందలాది అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చి కోట్ల రూపాయలు జేబులు నింపుకున్నాడని ఆరోపణలు వున్నాయి. ఈ నేపథ్యంలో ఏసీపీ మునిరత్నం కడప కార్పొరేషన్‌కు సెప్టెంబరులో బదిలీ కాగా.. అతని స్థానంలో కడప నుంచి ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి బదిలీపై వచ్చిన ఏసీపీ నాగరాజుకు చార్జ్‌లిస్టు అప్పగించలేదని సమాచారం. చార్జ్ అప్పగించక పోవడంతో ఏసీపీకి ఎల్‌పీసీ కూడా ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఇంకా ఇవ్వలేదని కార్యాలయ వర్గాల సమాచారం. ముఖ్యంగా వసంత పేట లేఅవుట్‌కు సంబంధించి కీలక ఫైళ్లు, రికార్డులు టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో కనిపించడం లేదనే చర్చ జరుగుతోంది.

మున్సిపల్ ఆఫీసు పక్కన వున్న విలువైన 8 సెంట్ల స్థలానికి సంబంధించి వసంతపేట లేఅవుట్ ప్లాట్ల రికార్డుల్లో వుంది. ఆ స్థలంపై వివాదం నడుస్తోంది. కొందరు ఆ స్థలం తమదని చెప్పి ఆక్రమించే ప్రయత్నం చేశారు. వైసీపీ హయాంలో ఆస్థలం రికార్డుపరంగా స్వాధీనం చేసుకోవడానికి అప్పటి ఎమ్మెల్యేకు రూ.25లక్షలు ఇచ్చారని ప్రచారం సాగింది. అంతేకాకుండా విశ్రాంత తహసీల్దారు ఒకరు ఆ స్థలం తమ బంధువులదని.. దాని రికార్డులు మున్సిపాలిటీలో వున్నాయని.. అవి ఇవ్వడం లేదని అనేకసార్లు సమాచార హక్కు చట్టం కింద కోరారు. కానీ ఆ ఫైలు నేటికీ ఎక్కడ వుంద నేది. అప్పటి ఏసీపీ మునిరత్నంకు తెలుసని ఆ సెక్షన్ క్లర్కులు చెబుతున్నారు. మునిరత్నం వున్నంత వరకు ఫైళ్లు అన్నీ తన వద్దే పెట్టుకునేవారని, క్లర్కుల వద్ద వుంచేవాడు కాదని సెక్షన్ ఉద్యోగులే చెబుతున్నారు.

మున్సిపాలిటీలో ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేసిన బిల్డింగ్ పర్మిషన్ల ఫైళ్లు పాత రికార్డులన్నీ హార్డ్ డిస్కులో కాపీ చేశారు. కానీ ఆ హార్డ్ డిస్క్ కాపీ సైతం ఆ సెక్షన్‌లో లేకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఏ ఫైలు కావాలన్నా ఆన్‌లైన్ సాఫ్ట్ కాపీ లేకపోవడం, పాత రికార్డు ఫైళ్లు చూసుకో వాలంటే కష్టంగా మారుతోందని ఉద్యోగులు చెబుతున్నారు. రూత్ మేరికి చెందిన ఇంటి రిజిస్ట్రేషన్ ఫైలు సైతం సెక్షన్‌లో మాయమైనట్లు కమిషనర్ గుర్తించారు. అనేక ఫైళ్లకు సంబంధించి ఆర్‌టీఐ ఫిర్యాదులు వస్తున్నాయని, వాటికి సంబంధించి సెక్షన్‌లో ఫైళ్లు కానరాకపోవడంతో సిబ్బందిని అందరినీ విచారించినా తేలలేదు. సమస్యల్లో ఉన్న వేళ్లన్నీ ఏసీపీ మునిరత్నం వైపే చూపుతున్నాయి. దీంతో ఏసీపీకి నవంబరు 28న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున నోటీసులు జారీ చేశారు. వసంతపేట లేఅవుట్ ఫైల్, రూత్‌మేరి హౌస్ రిజిస్ట్రేషన్ ఫైలు ఇతర ఫైళ్లపై సమాధానం ఇవ్వాలని, కొత్త ఏసీపీకి చార్జ్ లిస్టు అప్పగించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. డిసెంబరు 2 లోపు చార్జ్ అప్పగించి ఫైళ్ల సమాచారం వివరాలు తెలియజేయాలని.. లేకుంటే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో కమిషనర్ పేర్కొన్నారు.

ఎడతెరపి లేని వర్షం

- కొట్టుకుపోయిన కొండారెడ్డిపోడు, రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు
- వీడని వర్షం.. రైతుకు కష్టం



కొట్టుకుపోయిన రెడ్డివారిపల్లెకు వెళ్లే తాత్కాలిక రోడ్డు

రైల్వేకోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా రైల్వేకోడూరు నియోజకవర్గవ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. ఆదివారం కురిసిన భారీ వర్షానికి నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. మండలంలోని రెడ్డివారిపల్లె, కొండారెడ్డిపోడు గ్రామాలకు వెళ్లే తాత్కాలిక రోడ్లు వరద నీటికి కొట్టుకుపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు రైల్వేకోడూరుతో సంబంధాలు తెగిపోయాయి. మూడు రోజులుగా వర్షం వీడకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటు వ్యవసాయ, భవన నిర్మాణ పనులు లేకపోవడంతో కూలీలు ఇక్కట్లు పడ్డారు. మండలంలోని శెట్టిగుంట చెరువులోకి పూర్తి స్థాయిలో నీరు చేరి పొంగి అలుగు పారుతోంది. అదేకాకుండా గుంజన, కల్లేరు, గుండాలేరు తదితర నదులు ఉధృతంగా ప్రవహించాయి. వర్షాలకు అనంతరాజుపేట టిష్యూకల్చర్ నర్సరీలోకి నీరు చేరడంతో మొక్కలు దెబ్బతిన్నాయి. గుండాలపల్లె, ఓబనపల్లె, బయనపల్లె తదితర గ్రామాల్లోని అంటు మొక్కల్లో వర్షపు నీరు చేరడంతో మొక్కలు చనిపోతున్నాయని ఇటు వ్యాపారులు, అటు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్టోబరు మాసం నుంచి తరచూ వర్షాలు రైల్వేకోడూరులో వర్షాలు కురుస్తున్నాయి. మామిడికి కోలుకోలేని దెబ్బపడింది. భూమిలో తేమ శాతం ఎక్కువ కావడంతో మామిడికి పూతలు రావని రైతులు అంటున్నారు. నాటిన బొప్పాయి మొక్కలు చనిపోతున్నాయని రైతులు ఆందోళన పడుతున్నారు. ఇదిలా ఉండగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైల్వేకోడూరు-తిరుపతి మార్గంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.



బాలపల్లె అటవీ ప్రాంతంలో ప్రయాణికులకు కనువిందు చేస్తున్న జలపాతం

కొండా కోనల్లో...

తిరుమలగిరుల నుంచి జాలువారిన నీరు
జలపాతమై ప్రవహిస్తున్న వర్షపు నీరు

రైల్వేకోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల గిరుల నుంచి వర్షపునీరు జాలువారుతున్నాయి. కొండాకోనలు దాటి రైల్వేకోడూరు పరిసర కొండల్లో జలపాతమై పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా తిరుమలగిరిలోని జలాశయాలు పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధారల్లో ఆదివారం ఉధృతంగా వరద నీరు చేరడంతో రైల్వేకోడూరు అడవుల్లో ఎక్కడ చూసినా వరద నీటి ప్రవాహం చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నీటి గలగల శబ్దాలు వినసొంపుగా ఉన్నాయి. జలాశయాలు పూర్తిస్థాయిలో వరద నీరు చేరడంతో పొంగిపొర్లుతున్నాయి. అక్కడి నుంచి వెలుగొండ, శేషాచలం అడవుల నుంచి రైల్వేకోడూరు మండలం బాలపల్లె అటవీ ప్రాంతంలో వరద నీరు జలపాతాల్లా ప్రవహిస్తున్నాయి. ఈ జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ముందస్తు చర్యగా రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు తన సిబ్బందితో ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తిరుమలలోని పాపవినాశనం డ్యాంలో 693.27 మీటర్లకు 697.14 మీటర్ల వరకు వరద నీరు చేరింది. గోగర్భం డ్యాంలో 2894 అడుగులకు 2894 అడుగులు నిండింది. ఆకాశగంగ డ్యాం 855.0 మీటర్లకు 865.00 అడుగులు నిండింది. కుమారధార డ్యాం లో 890.80 మీటర్లు, పసుపుధార డ్యాం 896.35 మీటర్లకు 898.24 మీటర్ల వరకు నీరు చేరిందని సంబంధిత అధికారు లు తెలిపారు. వర్షం తగ్గకపోవడంతో అడవుల్లో వరద నీరు పెరుగుతూ ఉంది.

'సాగర్' కాల్వలకు మోక్షమెప్పుడు?

మొరాయించిన తూము గేట్లు ● మరమ్మతులు చేసినా ఫలితం శూన్యం
కాల్వల్లో పెరిగిన చెట్లు ● పూర్తికాని కుడి కాల్వ పనులు



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు ఎడమ, కుడికాల్వల మరమ్మతులకు మోక్షం వచ్చినట్లులేదు. గురవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణులు తూము గేట్లు మరమ్మతు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా ఇప్పటికే వ్యవసాయానికి నీరు వదలడంతో కుడికాల్వ వెంబడి 230 క్యూసెక్కులు, ఎడమ కాల్వ వెంబడి 400 క్యూసెక్కులు నీరు పారుదల ఉంది. ప్రస్తుతం తూముర గేట్లు మొరాయించడంతో కుడికాల్వ ద్వారా పోయే నీరు ప్రస్తుతం చెరువుల్లోకి వెళుతున్నాయి. చెరువులు నిండిన వెంటనే పంట పొలాల్లోకి పోతాయని, పంటలు నాశన మవుతాయని రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. వేసవిలో రైతన్నలకు నీళ్లు అందాలంటే ప్రస్తుతం మొరాయించిన బ్రహ్మం సాగర్ గేట్లకు మర మ్మతులు చేపట్టాలని రైతన్నలు కోరుతున్నారు. వివరాల్లోకెళితే...


బ్రహ్మంసాగర్ ఆయకట్టు కింద దాదాపు లక్షా 80వేల ఎకరాలు సాగులోఉంది. కొత్తూరు, పాతూరు, నరసన్నపల్లె, ముదిరెడ్డిపల్లె, సౌదరివారిపల్లె ఆశ్ర మం గంగిరెడ్డిపల్లె దిగువ నేలటూరు, మల్లేపల్లె ల్లో ఏటా రెండు దఫాలుగా పైర్లు వేస్తుంటారు. పంటలకు నీటిని సరఫరా చేసే పిల్లకాల్వలు లేకపోవడంతో సాగునీరు అందడంలేదని రైతన్నలు వాపోతున్నారు. ప్రస్తుతం బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో 11 టీఎంసీలు నీరున్నా సమయానికి పంటలకు నిరందని పరిస్థితి. మెయిన్ కాల్వ వెంబడి నీళ్లు వెళుతున్నా సకాలంలో పంటకు నీరందడంలేదు. ఎడమ కాల్వ వైపు ఉన్న చెరవులకు నీళ్లు అరకొరగా వెళుతున్నా కుడికాల్వ వైపు ఉన్న కాల్వ వెంబడి నీళ్లు వృధాగా వెళుతున్నాయి. ఇక్కడ పిల్లకాల్వల పనులే ఇందుకు అడ్డంకిగా చెప్పవ చ్చు. ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా పంటలకు సంతృప్తికరంగా నీళ్లు అందడంలేదని రైతులు బాధపడుతున్నారు. ఈ విషయంపై రైతులు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సాగర్ కుడికాల్వ తూముగేట్లు మరమ్మతులకు గురవడంతో నీళ్లు వృధాగా వెళ తున్నాయి. ప్రస్తుతం వరి పంట చేతికి వస్తున్న తరుణంలో కుడికాల్వ ద్వారా పారుదలయ్యే నీరు పొలాల్లోకి వస్తాయని ఆందోళనకు గురవుతున్నారు. తెలుగుగంగ అధికారులు పదిరోజులుగా గేట్ల మరమ్మతులు చేపట్టినా కూడా ఫలితం దక్కలేదు. బ్రహ్మంసాగర్ నిండు కుండలా ఉన్నా పంటలకు నీరందడం లేదని మరోవైపు బ్రహ్మంసాగర్ కుడివైపు తూము గేట్లు మొరాయించడంతో నీళ్లు వృధాగా పోతున్నాయని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కుడికాల్వ తూము గేట్లు మరమ్మతులు చేపట్టాలని, మెయిన్ కెనాల్ కాల్వ వెంబడి పంట పొలాల్లోకి వెళ్లే చిన్న కాల్వల పనులు చేయించాలని రైతన్నలు కోరుతున్నారు.



గేటు మరమ్మతు పనులు చేయిస్తున్న అధికారులు



కంపచెట్లతో నిండి ఉన్న చిన్నకాల్వలు



అసంపూర్తిగా కాల్వలు

అనుమానాస్పద స్థితిలో ఉద్యోగి మృతి

అనుమానం వ్యక్తం చేసిన మృతుడి భార్య ● ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ లింగప్ప

జమ్మలమడుగు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నుంచి శేషారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో మోటారు సైకిల్ పక్కనే మేకా వసంతకుమార్ (27) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు ఎస్‌పీజీ క్వార్టర్స్ వాసి వసంతకుమార్ కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మ్మలమడుగు నుంచి కడపకు వెళ్లి తిరిగి జమ్మలమడుగు వస్తాడు. అయితే రాత్రి 12 గంటలకు ఇంటి నుంచి బుల్లెట్ సైకిల్‌పై (రాళ్లగుండ్ల కుంట) శేషారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో వెళ్లాడు. అక్కడ కేవలం తలకు, ముఖానికి రక్తగాయాలై ఘటనా స్థలంలోనే మృతిచెంది పడి ఉన్నాడు. ఆదివారం ఉదయాన్నే తెల్లవారుజామున ఆ వైపున వాకింగ్‌కు వెళ్లేవారు సమాచారం ఇచ్చారు. అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐలు రామక్రిష్ణ, కల్పన, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న మృతుని బంధువులు ఆస్పత్రి వద్దకు వెళ్లి మృత దేహాన్ని చూసి బోరున విలపించారు. మృతునికి భార్య వసుంధర, కుమారుడు ఉన్నాడు. తన భర్త మృతికి గల కారణాలు తెలియాలని, అనుమానం ఉన్నట్లు మృతుని భార్య అర్బన్ పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



వసంతకుమార్ మృతదేహం

రేషన్ కార్డులు, పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పేదలకు కొత్తరేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేస్తోందని అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలలకే అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. సోమవారం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. సంక్రాంతి కానుకగా అర్హులకు జనవరిలో కొత్తకార్డులు మంజూరు చేస్తామని తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

కడప క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో ఓ వృద్ధురాలు మెడలోని గొలుసును గుర్తు తెలియని దొంగలు అపహరించారు. ఒంటరిగా ఉన్న వృద్ధురాలి వద్దకు వచ్చి పింఛను ఇప్పిస్తామంటూ చెబుతూ మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లి పారిపోయారు. ఈ మేరకు చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో వృద్ధురాలి బంధువులు ఫిర్యాదు చేశారు.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

రూ.12.5 లక్షల విలువైన నగదు స్వాధీనం



అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసిన రాజంపేట డీఎస్పీ సుధాకర్, సీఐలు

రాజంపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజంపేట, చిట్వేలి పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడిన అంతరాష్ట్ర దొంగలను ఎట్టకేలకు రాజంపేట, రైల్వేకోడూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎన్.సుధాకర్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా బిట్రగుంట కప్పట్రాల తిప్ప వాసి పీట్ల మహేష్, పీట్ల శరీస్‌కుమార్ అక్టోబరులో కె.శ్రీనివాసులు స్థానిక ఐడీబీఐ బ్యాంకులో కుదువ పెట్టిన బంగారాన్ని విడిపించుకుని తీసుకువస్తున్న క్రమంలో రెక్కీ చేసి స్కూటీలో ఉన్న డబ్బు, బంగారాన్ని దొంగలించారు. చిట్వేలిలో కూడా బ్యాంకు వద్ద రెక్కీ చేసి బంగారం దొంగలించారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పట్టణ సీఐ ఎల్లంరాజు, రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, చిట్వేలి ఎస్ఐ కె.రఘురాం, సిబ్బంది వారిని పట్టుకున్నారు. వారి నుంచి 132 గ్రాముల బంగారం, రూ.3.10 లక్షల నగదు, ఒక బైకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12.5 లక్షలు ఉంటుందని తెలిపారు. గతంలో వీరు అనేక జిల్లాల్లో ఇతర రాష్ట్రాల్లోనూ నేరచరిత్ర ఉందని, పలు కేసుల్లో నిందితులని డీఎస్పీ తెలిపారు.

టీడీపీ నేతలపై కత్తులతో దాడి - ఒకరికిగాయాలు

ముద్దనూరు డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక పులివెందుల రోడ్డులోని టీ కహాని సమీపంలో ఆదివారం సాయంత్రం బైకులో వెళుతున్న వేల్పుచర్ల టీడీపీ నేతలను అదే గ్రామ వైసీపీ నేతలు కత్తులతో దాడి చేయగా టీడీపీకి చెందిన గంగరాజు ఎడమ కాలికి తీవ్రగాయమైంది. బాధితుడు సమాచారం మేరకు వివల్లోకెళితే...

కొద్ది రోజుల కిందట వైసీపీకి చెందిన ఈశ్వరయ్య జీవాలు దొంగలు తీసుకెళ్లారు. ఈవిషయమై మా బంధువైన ఓబులేసు, ఈశ్వరయ్య, అతని కొడుకు శివకృష్ణ జీవాలు దొంగలించింది నీవేనని బెదిరిస్తూ వేధిస్తున్నారు. ఆదివారం వెల్పుచర్లలో ఇంటికి వెళుతుండగా ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు కారంపొడితో దాడి చేశారు. దీంతో ఇరువర్గాలు దాడికి దిగాయి. పోలీసులు సంఘటనా స్థలంకు చేరుకుని ఇరువర్గాలను అదుపు చేశారు. ఇరువర్గీయులూ స్టేషన్‌రావాలని పోలీసులు తెలపడంతో ఓబులేసుతో కలిసి బైకులో వస్తుండగా టీకహాని వద్ద ఈశ్వరయ్య అతని కొడుకు మరి కొందరు వైసీపీ నేతలు బోలేరో వాహనంతో బైకు వెనుక వైపున ఢీకొట్టారు. వెంటనే వాహనంలో తెచ్చిన కత్తులతో కిందపడిన వారిపై దాడి చేశారు. ఓబులేసుకు స్వల్పగాయాలవగా, గంగరాజు కాలికి తీవ్రగాయమైంది. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

స్థలాన్ని పరిశీలించిన దిశ డీఎస్పీ



విచారణ చేస్తున్న కడప దిశ డీఎస్పీ రమాకాంత్

కొండాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెయిన్‌బజార్‌లోని ఓ స్థలం విషయమై కడప దిశ డీఎస్పీ రమాకాంత్ ఆదివారం విచారణ చేపట్టారు. చౌటిపల్లె వాసి వెంకటేశ్వర్లు స్థలం విషయమై ముద్దనూరు మండలం కొర్రపాడు వాసులు శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి కులం పేరుతో దూషించారని పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక మెయిన్‌బజార్‌లో ఉన్న స్థలాన్ని పరిశీలించి డీఎస్పీ స్థానికులను విచారించారు. కార్యక్రమంలో కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



కొండాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రనగర్ వాసి, టీడీపీ కార్యకర్త కుడుముల నాగేశ(55) ఆదివారం తెల్లవారుజామున ఇంటి మెట్ల నుంచి జారిపడి మృతి చెందాడు. ఇంటి డాబా నుంచి మెటికలు దిగుతూ ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో ఇతని తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ఇతన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. నాగేశ స్థానికంగా గాలిమిషన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గోరిశెట్టి బాబు, బుజ్జి తదితర టీడీపీ నేతలు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

జాతీయ జట్టుకు అరుణ ఎంపిక



కడప స్పోర్ట్స్, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పుట్‌బాల్ ఫెడరేషన్ 2024 అండర్-20 మహిళా జాతీయ స్థాయి పుట్‌బాల్ ట్రయల్స్‌కు జిల్లా నుంచి తమటపు అరుణ ఎంపికైంది. ఈనెల 10న బెంగుళూరులో ఏఐఎఫ్ఎఫ్ పుట్‌బాల్ ట్రయల్స్‌కు రాష్ట్రంలో ఇద్దరు ఎంపికయ్యారు. ఇందులో కడప జిల్లా నుంచి అరుణ, అనంతపుర జిల్లా నుంచి మందల అనూ ష ఎంపికైనట్లు ఏపీ పుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. శ్రీధర్ వెల్లడించారు.

'మధ్యంతర భృతి ప్రకటించాలి'

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పీఆర్సీ ఇస్తానని చెప్పిన మాటను సీఎం చంద్రబాబు నాయుడు నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులకు ఐదేళ్లుగా డీఏ బకాయిలు జమ కాలేదని వాటిని వెంటనే ఉద్యోగుల ఖాతాకు జమ చేయాలని కోరారు. ప్రభుత్వం పీఆర్సీ కమిటీ వేగవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుని నివేదికను సత్వరం తెప్పించుకుని అమలు చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకట జనార్ధనరెడ్డి సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

రైలు ఢీకొని వృద్ధునికి గాయాలు



చికిత్స పొందుతున్న గోపాల్

కొండాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చౌటిపల్లె- ఓబుళాపురం మధ్యలో ఆదివారం రైలు ఢీకొనడంతో వృద్ధునికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన గోపాల్ రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ సంఘటనలో కాలు, చేయి విరిగినట్లు సమాచారం. ఇతన్ని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

'కరెంటు చార్జీల భారం తగదు'



వేంపల్లె, డిసంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై కరెంటు చార్జీల భారం శోచనీయమని కాంగ్రెస్ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ఎన్నికల ముందు చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచాలనుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రజలను మోసం చేయడం తగదన్నారు. ఇటీవలే సర్దుబాటు పేరుతో రూ.6వేల కోట్లు భారం వేశారని, మళ్లీ ఇపుడు రూ.9వేలకోట్లు భారం వేయడం ప్రజలను వంచించడమేనన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రజలపై కరెంటు చార్జీల భారం లేకుండా చూడాలని తులసిరెడ్డి హితవు చెప్పారు.

అదుపు తప్పి బోల్తా పడిన బస్సు

● కారును ఢీకొని...
● పలువురికి తీవ్ర గాయాలు ● తిరుపతికి ఇద్దరి తరలింపు

కురబలకోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న బస్సును వెనుక నుంచి వస్తున్న కారు అధిగమిస్తుండగా బస్సు అదుపు తప్పి కారును ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరు పతికి తరలించారు. శనివారం అర్ధరాత్రి జరిగిన ఘటన వివరాలిల్లోకెళితే....

కనిగిరి నుంచి బెంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు కురబలకోట ఫ్లైఓవర్ వద్ద వెళుతోంది. కడప రోడ్డు నుంచి మదనపల్లె వైపు (వెనుక భాగం) నుంచి వస్తున్న కారు ముందు వెళుతున్న బస్సును అధిగమిస్తుండగా ప్రమాదవశాత్తు బస్సు కారును ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో చిన్నయ్య, కొండమ్మ, బావాజీ, బెంగళూరుకు చెందిన వెంకటరమణ, కనిగిరి వాసులు లేయమ్మ, సాలెమ్మ, మాలకొండయ్య గాయపడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు వైద్యులు చికిత్స నిర్వహించారు. కాగా లేయమ్మ, మాలకొండయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సం ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రమాదంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యశాఖాధికారులను ఆదేశించారు.





రోడ్డు ప్రమాదంలో బోల్తాపడిన బస్సు - క్షతగాత్రులను చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

బిట్స్ బుక్‌లెట్ ద్వారా ఉత్తీర్ణత సులభతరం

● జేఏసీ చైర్మన్ శ్రీనివాసులు



బిట్స్ బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ అమరావతి రూపొందించిన బిట్స్ బుక్‌లెట్ ద్వారా ఉత్తీర్ణత సులభతరమని జేఏసీ చైర్మన్ శ్రీనివాసులు, ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా కార్యదర్శి రవికుమార్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం కడప నగరం ఎన్జీఓ భవన్‌లో డిపార్ట్‌మెంటు పరీక్షలకు సంబంధించి బిట్స్ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల డిపార్ట్‌మెంటు పరీక్షల ఉత్తీర్ణతకు బుక్‌లెట్ అవసరమన్నారు. దీని ద్వారా పదోన్నతులు, ఇంక్రిమెంట్లు పొందేందుకు వీలుకలుగుతుందన్నారు. మెటీరియల్‌లోని మోడల్ పేపర్ల ద్వారా సులభంగా పరీక్ష రాసేందుకు వీలవుతుందన్నారు. ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గఫార్, రాజగోపాల్, వీరప్రసాద్ పాల్గొన్నారు.

'రాయలసీమలోని సంస్థలను తరలించవద్దు'

కడప సెవెన్‌రోడ్స్/నాగరాజుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమలో ఉన్న సంస్థలను తరలించవద్దని ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ, ఏపీజీబీ కార్యాలయాలను తరలించవద్దని రాయలసీమ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నేడు తహసీల్దారుకు వినతిపత్రాలు ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి పేరిట టోల్ వసూళ్లు చేయడం దారుణం

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర పర్యాటక శాఖ గండికోటకు నిధులు కేటాయిస్తున్నా జిల్లా పర్యాటక శాఖ అధికారులు అభివృద్ధి పేరుతో గండికోటకు వచ్చే పర్యాటకులతో టోల్‌ఫీజు వసూలు చేయడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరజాల శివకుమార్ తెలిపారు. ఆదివారం కడప ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ నిధులు కేటాయింపులో భాగంగా గండికోట అభివృద్ధికి దాదాపు రూ.70 కోట్ల నిధులు కేటాయిస్తూ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారన్నారు.

వైభవంగా పోలి అమావాస్య

● మల్లేశ్వరుడికి ఘనంగా రుద్రాభిషేకం



చెన్నూరు మల్లేశ్వరాలయంలో శివునికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

చెన్నూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరిరోజు బహుళ అమావాస్య (పోలి అమావాస్య) సందర్భంగా చెన్నూరులోని మల్లేశ్వరాలయం భక్తజనంతో కిక్కిరిసింది. తెల్లవారుజామునే మూలవిరాట్ మూర్తి మల్లేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామునే ఆలయానికి తరలివచ్చి పెన్నానదిలో కార్తీకదీపాలు వదిలి, ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. అనంతరం రుద్రాభిషేకం చేశారు. మల్లేశ్వర ఆలయ ప్రాంగణం ఓం నమశ్శివాయ, శివపంచాక్షరితో మార్మోగింది.అలాగే సాయంత్రం కార్తీక మాసం పూర్తయినందు వల్ల ఆకాశదీపాన్ని అవరోహణ చేశారు. అలాగే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు, అల్పాహారం అందించారు.

రూ.3వేలు తగ్గిన ధాన్యం ధర

● గింజ నల్లబడిందని కొనుగోలుకు రాని వ్యాపారులు ● ఆవేదనలో అన్నదాతలు



చిన్నమాచుపల్లె వద్ద వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారిణి శ్రీదేవి (ఇన్‌సెట్) నల్లబడ్డ ధాన్యం

చెన్నూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో మండలంలోని వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ధాన్యం నల్లబడటంతో రూ.12500 ఉన్న పుట్టి (8బస్తాలు) ఏకంగా రూ.3వేలు తగ్గించి రూ.9500కే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రామనపల్లె, ఉప్పరపల్లె చిన్నమాచుపల్లె రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ఇటీవల కురిసిన వర్షాలు, పొగమంచు వల్ల గింజ నల్లగా మారింది. ఈ విషయాన్ని రైతులు వ్యవసాయాధికారిణి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె పంటను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలిపారు. నల్లబడ్డ గింజను కొనేందుకు అధికారులు ముందుకు రాలేదు. దీంతో రైతులు చేసేదేమీ లేక పుట్టి ధాన్యాన్ని రూ. 9500కే తెగనమ్ముకుంటున్నారు. ప్రస్తుతం తుఫాను ప్రభావంతో వరి కోతలు ఆపేశారు. మిగిలిన పంట ఏమవుతుం దోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పెట్టుబడి కూడా చేతికి రాదు



18 ఎకరాల్లో వరి సాగు చేశాను. పెట్టుబడి కూడా వస్తుందో రాదోనని భయమేస్తోంది. గత ఏడాది కోత కోసిన మొదట్లోనే మంచి ధర వచ్చింది. ఇప్పుడు కూడా అదే ధర వస్తుందనుకుంటే గింజ నల్లబడి దెబ్బతీసింది. దళారులు అతి తక్కువ ధరకు అడుగుతున్నారు. ఇప్పటికే కొంత అమ్మాను. మిగిలింది కూడా తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది.

- పాలకొండయ్య, రైతు, చిన్నమాచుపల్లె

తగ్గించి అమ్మాలంటే బాధగా ఉంది



పుట్టిపై రూ.3వేలు తగ్గించి తెగనమ్మాలంటే బాధగా ఉంది. గింజ బయటికి వచ్చేంత వరకు బంగారం వర్ణంతో ఉండి తీరా కోశాక నల్లబడి రైతును నట్టేట ముంచింది. ఇంత తక్కువ ధరకు అమ్ముకుని ఏం లాభం. ప్రభుత్వమైనా కొంటాదనుకుంటే ఈ వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. రైతును ఆదుకునేది ఎవరు?

- పుత్తా నాగమునిరెడ్డి, రైతు, చిన్నమాచుపల్లె

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న ముస్తాక్ అహ్మద్ తదితరులు

కడప మారుతీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం. ముస్తాక్ అహ్మద్ అన్నారు. ఆదివారం దూదేకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మన్నూరు అక్బర్ ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ వద్ద 14వ మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మన్నూరు అక్బర్ మాట్లాడుతూ దూదేకుల వర్గీయులకు మాత్రమే కాకుండా కుల,మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సేవ చేయాలనే ధ్యేయంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్, ట్రాఫిక్ సీఐ జావీద్, టూటౌన్ ఎస్ఐ సిద్దయ్య, డాక్టర్ అబిద్, సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎం బాషా, కోశాధికారి ఆర్.హుస్సేన్, వర్కింగ్ సెక్రటరీ నజీర్, సలహాదారు బాబయ్య, జిల్లా అధ్యక్షుడు పి.మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పి.వి.ఎస్ మూర్తి తదితరులు

సికెదిన్నె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేట గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సగినాల శ్రీనివాసరాయల్, రెడ్డయ్యరాయల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం సీనియర్ నాయకుడు టి.వి.ఎస్ మూర్తి చేతుల మీదుగా కార్తీక పూజలు నిర్వహించి శ్రీకృష్ణదేవరాయుల చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు బలిజ కులస్థుల సంక్షేమానికి, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం కార్తీక వనభోజనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో బలిజ సంఘం సభ్యులు అమరప్ప, హరిప్రసాద్, హరీంద్రనాథ్, టింబర్‌డిపో శ్రీను, మురళీకృష్ణ, కృష్ణ, సుంకర శ్రీనివాసులు, దుర్గాప్రసాద్, వెంకటసుబ్బయ్య, గంధం మోహన్‌బాబు, వెంకటసుబ్బయ్య, కేకే తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో క్యాండిలైట్ ఆరాధన

కమలాపురం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెవరెండ్ యు.సాల్మన్ బాబు ఆధ్వర్యంలో కమలాపురం సీఎస్ఐ టౌన్ చర్చిలో ఆదివారం క్యాండిలైట్ ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమలాపురంలోని సీఎస్ఐ టౌన్ సంఘ సభ్యులు అందరూ పాల్గొని దేవుని ఆశీర్వాదం పొందుకున్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దాం



పులివెందులలో ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు విఘ్నేష్ తదితరులు... వేంపల్లెలో ర్యాలీ

పులివెందుల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిశ్శబ్దాన్ని ఛేదించి హెచ్ఐవి ఎయిడ్స్ గురించి చర్చించాలని హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ మనందర బాధ్యతని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విఘ్నేష్, యూపీహెచ్‌సీ డాక్టర్లు స్నేహ, శాంతకుమార్‌లు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో పాత ఏరియా ఆసుపత్రి నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఎయిడ్స్‌కి మందు లేదు, నివారణ ఒక్కటే మార్గం, ఎయిడ్స్ నివారణ మనందరి బాధ్యతని, ఎయిడ్స్ గురిచి తెలుసుకుందాం ఆరోగ్యంగా జీవిద్దాం అంటూ నినదించారు. గాంధీ సర్కిల్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెళ్లికి ముందు హెచ్ఐవి పరీక్ష చేయించుకోవడం బంగారు భవిష్యత్‌కి పునాదిలాంటిదన్నారు. ప్రతి ఒక్కరు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ, ఎస్‌టీఐ కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, బాదల్‌వలి, సీడీఎస్ డైరెక్టర్ ఏసురత్నం, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఇతర వైద్య, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి

వేంపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి అవసరమని వైద్యాధికారి శేఖర్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా వేంపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపకూడదని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి రాకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్వాతి, రామ్మోహన్, సుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఆదరించండి



మాట్లాడుతున్న నండూరి శ్రీనివాస్

కడప కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కని, పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను వారి సంతానం వృద్ధాప్యంలో ఆదరించాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త నండూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. కడప సమైక్య బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసాయి శ్రీనివాస్ గార్డెన్‌లో బ్రాహ్మణ కార్తీక సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ వారి బాల్య దశలో తల్లిదండ్రులు గోరుముద్దలు తినిపించి అల్లారుముద్దుగా పెంచారనే సంగతి గుర్తెరగాలన్నారు. అలాంటి వారిని వృద్ధాప్యంలో దూరంపెట్టరాదన్నారు. సమాఖ్య అధ్యక్షుడు శివరావు, ప్రధానకార్యదర్శి రమణయ్య పాల్గొన్నారు.

వైభవంగా అంబులం పూజ



కడప కల్చరల్, డిసెంబరు 1: కడప నగరం 49వ డివిజన్‌లోని ఆలంఖాన్‌పల్లెలో అయ్యప్ప స్వామి అంబులం పూజ ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. సాయంత్రం నుంచి కరిమలవాసుడికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పలు రకాల పూలతో స్వామివారిని అలంకరించారు. అయ్యప్ప మాలధారులు, గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల వారు వందలాదిగా తరలివచ్చి భజనలు చేయడంతో ఒక్కసారిగా అయ్యప్ప నామస్మరణలో భక్తులు మునిగిపోయారు. అనంతరం మాలధారులకు, గ్రామస్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన రెడ్డిచెర్ల జయరామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఆలంఖాన్‌పల్లెలో అయ్యప్ప స్వామి అంబులం పూజ నిర్వహిస్తున్న భక్తులు

నీటి సంఘం ఎన్నికలకు సిద్ధం కావాలి

వేంపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘం ఎన్నికలకు సిద్ధం కావాలని టీడీపీ మండల పరిశీలకులు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. సమావేశంలో మండలంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'కడప నగర సమగ్రాభివృద్ధే లక్ష్యం'

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కడప నగర సమగ్రాభివృద్దే లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఆర్‌కే నగర్‌లోని కామ్రేడ్ సీతారాం ఏచూరి భవన్ వద్ద కడప నగర కమిటీ 6వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పోరాడేది సీపీఎం ఒక్కటేనన్నారు. ప్రజలను సమీకరించి పోరాటంలో భాగస్వాములను చేసి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ఆలయాల రక్షణకు సమష్టి కృషి

కమలాపురం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల రక్షణకు సమష్టి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని లక్ష్మీనారాయణరెడ్డి, పెంచలయ్య అన్నారు. ఆదివారం స్థానిక నగర పంచాయతీ పరిధిలోని హైస్కూలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో హిందూ దేవాలయాలకు రక్షణ కరువైందన్నారు. ఈ నేపథ్యంలో హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి, రక్షణ, సమాజ సంరక్షణ కోసం జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.

హిందువులంతా ఏకతాటిపైకి రావాలి



మాట్లాడుతున్న రాధామనోహర్‌దాస్

కడప కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా హిందువులంతా ఒక్క తాటిపైకి రావాలని ప్రముఖ హిందూ ధర్మప్రచారక్ రాధామనోహర్ దాస్ పిలుపునిచ్చారు. కార్తీక మాసం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళీశర్మ, ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం శివప్రియ కల్యాణ మండపంలో సామూహిక హిందూ ఐక్య కార్తీక వనభోజన సమ్మేళనం నిర్వహించారు. సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణశర్మ, బీజేపీ నాయకుడు మునగా సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కోసం రూ.10 లక్షలు మంజూరు



పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండలం పైడిపాళెం గ్రామానికి చెందిన గుడుగుల బాబా నియాజ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ కింద రూ.10లక్షలు మంజూరైంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి వచ్చిన హామీ పత్రాన్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ చికిత్స పూర్తై డిశ్చార్జి అయిన 90 రోజుల లోపు ఈ లేఖతో పాటు ఒరిజినల్ బిల్లులు అందించాలని ఆ తర్వాత మొత్తాన్ని విడుదల చేస్తారని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

47 జీఓ రద్దుపై చట్టప్రకారం పోరాటం

● మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): రాజ్యాంగబద్దంగా 2023లో జీఓ 47 ద్వారా వక్ఫ్‌బోర్డును నియమించారని, దాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవడం దుర్మార్గమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా తెలిపారు. జీఓ రద్దుపై చట్టప్రకారం పోరాటం చేస్తామని తెలిపారు. ఆదివారం అంజద్‌బాషా తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నిబంధనల మేరకే వక్ఫ్‌బోర్డు నియామకం జరిగిందన్నారు. ఎమ్మెల్యేలు, ముతవల్లిలు, స్థానిక సంస్థలు.. ఇలా అన్ని కేటగిరిల్లో నియామకాలు జరిగాయన్నారు. బోర్డుసభ్యులు చైర్మన్‌ను ఎన్నుకుంటే ఆ నాడు టీడీపీ కోర్టులో కేసు వేసి నిలుపుదల చేశారన్నారు. చైర్మన్ ఎన్నిక కాకుండా ఆనాడు నాలుగు పిటిషన్లు వేశారన్నారు. ఈ అంశం ఇంకా కోర్టులోనే ఉందని, దాన్ని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. కమిటీకి ఐదేళ్లకాలం ఉంటే ఎలా రద్దు చేస్తారన్నారు. కేవలం టీడీపీ వారిని నియమించుకునేందుకే ఆ జీఓను రద్దు చేసినట్లు తెలిపారు. బోర్డు చాలా కాలంగా పనిచేయడం లేదని రద్దు చేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చిత్తశుద్ధి ఉంటే కోర్టులో రిట్‌ను ఉపసంహరించుకోవాలని, కానీ బోర్డును రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు. 2014 నుంచి 19 మధ్యకాలంలో చంద్రబాబు అసలు వక్ఫ్‌బోర్డునే నియమించలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక బోర్డుకాలపరిమితి ముగిసిన తరువాతే కొత్త బోర్డు నియామకం చేపట్టామన్నారు. జీఓ రద్దుపై చట్టపరంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడప క్రైం, డిసెంబరు 1,(ఆంధ్రజ్యోతి) :కడప నగరం గౌస్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. సీఐ వివరాల మేరకు అబ్దుల్ రసూల్ (40) బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత కొంత కాలంగా ఆరోగ్యం సరిగా లేక బాధపడుతుండేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం విషాహారం తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. రసూల్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

తొలగని మురుగు, పేరుకుపోతున్న చెత్త



చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్‌నగర్‌లో నిల్వ చేరిన మురుగు నీరు

సికెదిన్నె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్‌నగర్‌లో మురుగునీరు, చెత్త సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు వ్యాపిస్తున్నాయని, కూలి పనులు చేసుకుని సంపాదించుకున్నదాంట్లో ఆస్పత్రికి ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. మురుగునీరు, చెత్త వలన దుర్వాసన వెదజల్లడంతో పాటు ఆ ప్రాంతం పందులకు నిలయంగా మారిందన్నారు. రోడ్డు వెంబడి చెత్త పేరుకుపోయి ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు మురుగు ఇళ్ల మధ్యనే నిలిచి ఉండటంతో నిరంతరం పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా మురుగు సమస్య తొలగించాలని కోరుతున్నారు.

దోమలు విజృంభిస్తున్నాయి

మురుగు నీటి సమస్య ఎక్కువగా ఉండటంతో గ్రామంలో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీంతో ప్రజలు దుర్వాసన భరించలేక దోమలతో సతమతమవుతున్నారు. పిల్లలు, వృద్ధులు అనారోగ్యాలకుగురవుతున్నారు. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- మద్దిలేటి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు



రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్త